<u>AIIMS Bibinagar OPD services has special popularity</u>

# ఎయిమ్స్ ఓపీ సేవలకు విశేష ఆదరణ

- కొవిడ్ నేపథ్యంలో టెలీ కన్సల్టేషన్ సర్వీసు
- ఒకరోజు ముందుగానే అపాయింట్‌మెంట్..
- ఫోన్ ద్వారా వైద్యుల సలహాలు, సూచనలు



యాదాద్రి, జూలై 16(ఆంధ్రజ్యోతి): అఖిల భారత వైద్య విజ్ఞాన సంస్థ(బీబీనగర్ ఎయిమ్స్)లో ప్రారంభమైన అవుట్ పేషెంట్(ఓపీ) సేవలకు విశేష ఆదరణ లభిస్తోంది. కరోనా వైరస్ విజృంభిస్తున్న తరుణంలో గత నెల 2వ తేదీన బీబీనగర్ ఎయిమ్స్‌లో ఓపీ సర్వీసులు ప్రారంభించారు. గత 45 రోజుల్లో దాదాపు 600మందికి పైగా రోగులు వైద్యులను సంప్రదించారు. కరోనా వైరస్ వ్యాప్తి నేపథ్యంలో రోగులకు ఓపీ సేవలు అందుబాటులో ఉంచడానికి టెలీకన్సల్టేషన్ సేవలను సైతం ప్రారంభించారు. ఆస్పత్రిలోని వివిధ సూపర్ స్పెషాలిటీ విభాగాల వైద్య నిపుణులు టెలిఫోన్‌లోనే రోగులకు వైద్యచికిత్స, ప్రిస్క్రిప్షన్‌తో పాటు పలు సూచనలు, సలహాలు అందిస్తున్నారు. ఈ సదుపాయాన్ని హైదరాబాద్, సికింద్రాబాద్ జిల్లాల రోగులతో పాటు వరంగల్, మెదక్ జిల్లాలు, వాటి పరిసర పట్టణాల ప్రజలు ఎక్కువ ఉపయోగించుకుంటున్నారని ఎయిమ్స్ ఆస్పత్రి వర్గాలు పేర్కొంటున్నాయి. హైదరాబాద్ శివారులో యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ వద్ద ఏర్పాటైన ఎయిమ్స్‌లో జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, గైనకాలజీ, ఆర్థో, ఆప్తమాలజీ, కుటుంబ, సామాజిక వైద్య సేవలను ఎయిమ్స్ డైరెక్టర్ డాక్టర్ వికాస్‌భాటియా ఆధ్వర్యంలో వైద్య నిపుణులు అందిస్తున్నారు. కరోనా వ్యాప్తి నియంత్రణలో భాగంగా హైదరాబాద్‌తో పాటు పరిసర జిల్లాల ప్రజలకు టెలీ కన్సల్టేషన్ సర్వీసులను సైతం ప్రారంభించారు. సాధారణ ఓపీ సేవలకు అదనంగా గత నెల 8వ తేదీ నుంచి వీటిని అందుబాటులోకి తీసుకొచ్చారు. ఓపీ సేవలు అందించే అన్ని విభాగాల వైద్య నిపుణులు టెలీ కన్సల్టేషన్ ద్వారా రోగులకు అవసరమైన వైద్యం, సూచనలు, సలహాలు చేస్తున్నారు. ఈ సేవలకు సైతం విశేష ఆదరణ లభిస్తోందని ఎయిమ్స్ డైరెక్టర్ డాక్టర్ వికాస్ భాటియా తెలిపారు. టెలిఫోన్ ద్వారా వైద్య సేవలు పొందేందుకు ఒక రోజు ముందుగా ఆయా విభాగాల వైద్యుల అపాయింట్‌మెంట్ తీసుకోవాలి. దాని ప్రకారం సంబంధిత వైద్య నిపుణులు మరుసటి రోజు ఆ రోగి ఆరోగ్య సమస్యలను టెలిఫోన్ ద్వారా తెలుసుకుంటారు. అవసరమైన చికిత్స సలహాలు, సూచనలు అందిస్తారు. టెలీ కన్సల్టేషన్ సేవల్లో గైనకాలజీ, వృద్ధాప్య ఆరోగ్య సమస్యలు, జనరల్ సర్జరీ, ఆర్థో విభాగాల నిపుణులు ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, జనరల్ మెడిసిన్, ఆప్తమాలజీ విభాగాల నిపుణులు మధ్యాహ్నం 2గంటల నుంచి నియంత్రం 4గంటల వరకు అందిస్తారు. ఈ సేవలపై పరిసర గ్రామాల సర్పంచ్‌లు 464మందితో ప్రజలకు అవగాహన కల్పించామని ఆస్పత్రి వర్గాలు పేర్కొన్నాయి.

## ఓపీ సేవలకు విశేష ఆదరణ

బీబీనగర్ ఎయిమ్స్ అభివృద్ధి ప్రాథమిక దశలోనే ఉంది. ప్రస్తుతం పరిమితమైన వసతి, సదుపాయాల మధ్య ఆస్పత్రి కార్యకలాపాలు కొనసాగుతున్నాయి. జూన్ 2నుంచి అవుట్ పేషెంట్ సేవలు ప్రారంభించాము. కరోనా వ్యాప్తి నియంత్రణలో భాగంగా టెలీ కన్సల్టేషన్ సేవలనూ అందుబాటులో కి తీసుకొచ్చాం. వీటికి విశేష ఆదరణ లభిస్తోంది. యాదాద్రి జిల్లా నుంచి గాక హైదరాబాద్, సికింద్రాబాద్, వరంగల్, మెదక్ తదితర పట్టణాల నుంచి సైతం సేవలను వినియోగించుకుంటున్నారు. టెలీ కన్సల్టేషన్ కోసం 08685-295050 నంబరుకు ఒక రోజు ముందు సంప్రదించాలి.

**- డాక్టర్ వికాస్ భాటియా, డైరెక్టర్, ఎయిమ్స్, బీబీనగర్**